సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 29 । నవంబర్ । 2024



సకుటుంబ సమేత అరాచకం

యర్రగొండపాలెంలో పెత్తనం కోసం ఓ పచ్చ నేత కుటుంబం అరాచకాలు సృష్టిస్తోంది. అక్రమ కేసులు, నెలవారీ మామూళ్లు, దౌర్జన్యాలతో రెచ్చిపోతోంది. - 8లో..



ఎర్రచందనం దుంగలను తిరుపతి తరలించండి

కనిగిరిలో ఉన్న ఎర్రచందనం దుంగలను తిరుపతి తరలించాలని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/21

వాతావరణం

పొగమంచు ఎక్కువగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

పోరాడారు.. గెలిచారు

- రేషన్‌దుకాణాలపై అక్రమ కేసులు
- వైఎస్సార్‌సీపీ సానుభూతి డీలర్లను తొలగించే ప్రయత్నం
- కోర్టు ద్వారా తిరిగి దుకాణాలు దక్కించుకున్న డీలర్లు



అంకేపల్లి చౌక దుకాణాన్ని దక్కించుకున్న కోర్టు ఆర్డర్

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ దుకాణాలపై కన్నేశారు. ఉన్న దుకాణాలన్నింటినీ టీడీపీ అనుచరులకు కట్టబెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి దుకాణాలు నిర్వహిస్తున్న వారిని బెదిరించి దుకాణాలు స్వాధీనం చేసుకున్నారు. మాట వినకుంటే అధికారులతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేశారు. అయినా వెనక్కి తగ్గని డీలర్లపై అక్రమంగా కేసులు నమోదు చేసి దుకాణాలు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. అయితే మండలంలో పలువురు రేషన్ డీలర్లు కూటమి నేతల అక్రమాలకు ఎదురొడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు డీలర్ల వాదనతో ఏకీభవించి వారికి దుకాణాలను తిరిగి కేటాయించాలని తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని అంకేపల్లి, కూచిపూడి, గార్లపేట గ్రామాల్లోని రేషన్ డీలర్లపై అక్రమంగా కేసులు బనాయించి దుకాణాలు తొలగించాలని టీడీపీ నాయకులు పన్నాగం పన్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతో వారిని టార్గెట్ చేసి దాడులు చేశారు. అందులో భాగంగా ఈ మూడు దుకాణాల్లో ఉన్న సరుకును తనిఖీ చేయకుండానే అక్రమంగా ఈ నెల 17న 6ఏ కేసులు నమోదు చేశారు. కూచిపూడి దుకాణంలో ఉన్న సరుకును డీటీ తనిఖీ చేయకుండా టీడీపీ నాయకుల ఇళ్లలో కూర్చుని దుకాణం నంబర్ 21 పై 6ఏ కింద అక్రమ కేసు నమోదు చేశారు. అలాగే మండలంలోని అంకేపల్లి రేషన్ దుకాణం నంబర్ 22పై ఈ నెల 17 న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. సరుకు సక్రమంగా ఉన్నా రేషన్ బియ్యం కొలతల్లో తేడాలు ఉన్నాయని, అక్రమ కేసులు బనాయించారు. 6ఏ కింద కేసు నమోదుచేసి దుకాణాన్ని డీలర్ నుంచి తప్పించారు. కూచిపూడి డీలర్ మాచేపల్లి హనుమంతరావు, అంకేపల్లి డీలర్ పాలుగుండ్ల శ్రీదేవిలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ద్వారా విజయం సాధించి డీలర్‌షిప్‌లను తిరిగి దక్కించుకున్నారు.

పొగాకు రైతుపై..

పెట్టుబడి పిడుగు..!



పొగాకు సాగు రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అయితే భారీ స్థాయిలో పెట్టుబడి ధరలు పెరుగుతుండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. కూలి రేట్ల దగ్గర నుంచి భూమి కౌలు, బ్యారన్, పురుగుల మందుల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. దాదాపు సాగు వ్యయం రెట్టింపయింది. ఈ క్రమంలో ధరలు ఏ రకంగా ఉంటాయనే దానిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

- ప్రకాశం రీజియన్‌లో ప్రారంభమైన పొగాకు సాగు
- ఇప్పటికే 32,600 హెక్టార్లలో నాట్లు
- 105.27 మిలియన్ కేజీల సాగుకు బోర్డు అనుమతి
- భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం
- రెట్టింపైన బ్యారన్, భూమి కౌలు రేట్లు
- పెరిగిన కూలీల వేతనాలు
- పెట్టుబడులు పెరగడంతో రైతుల్లో ఆందోళన
- పరిమితి సాగే మేలంటున్న బోర్డు అధికారులు



పొలంలో రైతులు వేసిన పొగాకు నాట్లు

కొండపి: పొగాకు సాగు పెట్టుబడి ధరలు భారీగా పెరగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రకాశం రీజియన్ పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. ప్రకాశం జిల్లాలో ఒంగోలు-1, ఒంగోలు- 2, కొండపి, కనిగిరి, టంగుటూరు, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాలు ఉండగా, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కందుకూరు-1, కందుకూరు- 2, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలు ఉన్నాయి. రీజియన్ పరిధిలో రానున్న సీజన్‌కు 105.27 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతిస్తూ పొగాకు బోర్డు నిర్ణయం తీసుకుంది. గతేడాది 2023-24లో 89.9 మిలియన్ కేజీలకు అనుమతిచ్చింది. 2024-25 ఏడాదికి గతానికంటే అదనంగా 15.37 మిలియన్ కేజీలు ఉత్పత్తి చేసేందుకు బోర్డు అనుమతిచ్చింది.

గణనీయంగా పెరగనున్న సాగు...

గతంలో మాదిరిగానే బోర్డు నిర్ణయించిన పరిమితికి మించి పొగాకు సాగుచేస్తూ వస్తున్నారు రైతులు. అదే మాదిరిగా ఈ దఫా బోర్డు 105.27 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతిచ్చింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని పరిశీలిస్తే సాగు విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, అంతర్జాతీయంగా ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పలేమని, పరిమితికి మించి సాగుచేయొద్దంటూ బోర్డు అధికారులు రైతులకు చెబుతున్నారు. ఆ మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే సాగు చేయాలని సూచిస్తున్నారు.

భారీగా పెరిగిన ఖర్చులు...

జిల్లాలో మూడు వారాల నుంచి నాట్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు భారీగా సాగు విస్తీర్ణం పెరగనుంది. అయితే ఖర్చులు భారీగా పెరిగాయి. గతంలో ఎకరాకు ఒకటిన్నర మూట నారు అవసరం కాగా, దాని ధర రూ.2000 నుంచి రూ.3000 వరకు ఉండేది. ఈ ఏడాది అది కాస్తా రూ.4000 నుంచి రూ.5000 వరకు చేరింది. నాణ్యత సరిలేక రెండు మూటలు వేయాల్సి వస్తోంది. అలాగే నాట్ల కూలి కూడా గతంలో మనిషికి రూ.300 నుంచి రూ.400 ఉండగా, ప్రస్తుతం రూ.500 నుంచి రూ.600 వరకు చేరింది. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో రైతులపై మరింత భారం పడే అవకాశం కనిపిస్తోంది. పొలాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుంటలు, చెరువులు, వాగులు, వంకల నుంచి ట్రాక్టర్లలో నీళ్లు తెచ్చుకుంటున్నారు. అవి లేని చోట **పొలాల్లో ఉండే బావుల నుంచి పైపులైను వేసి** నీటిని తరలిస్తున్నారు. ఫలితంగా ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు అదనంగా నీటి అవసరాలకు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కొందరు రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ నీటి కోసం వెచ్చిస్తుండటం గమనార్హం.

అనుకూలంగా వాతావరణం...

పశ్చిమ ప్రాంతంలోని తేలిక నేలల్లో సెప్టెంబర్‌లో పొగాకు నాట్లు చేపట్టగా, నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. గతేడాది భారీ ధరలు లభించి రాబడి ఉండటంతో, ఈ ఏడాది పొగాకు సాగుకు వాతావరణం బాగా అనుకూలించింది. దీంతో రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. ఒంగోలు రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు 32,600 హెక్టార్లలో సాగుచేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, బోర్డు నిబంధన మేరకు పంట ఉత్పత్తి రాకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పరిమితికి మించి పంట వేయొద్దు



పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే రైతులు పంటలు వేయాలి. అనుమతి మించి సాగు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గతేడాది పొగాకు పండించే ఇతర దేశాలలో పొగాకు పంట దెబ్బతినడంతో మన ప్రాంతంలో పండించిన పొగాకుకు డిమాండ్ ఏర్పడింది. ఈ సంవత్సరం ఆ పరిస్థితి ఉండక పోవచ్చు. రైతులు పురుగుమందుల అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు పండించాలి. పొగాకు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం మార్కెట్లో అంత ధరలు ఉంటాయని చెప్పలేం రైతులు భూములను అధిక కౌలుకు తీసుకోవద్దు. పొగాకు బోర్డు చెప్పే జాగ్రత్తలు పాటించాలి.

– జి.సునీల్ కుమార్,
వేలం నిర్వహణ అధికారి

రెట్టింపైన బ్యారన్ కౌలు...

వేలంలో మంచి ధరలు వస్తుండటం, రైతులకు లాభాలు కురిపిస్తుండటంతో బ్యారన్ కౌలు ధరలు భారీగా పెంచేశారు. 2021-22 ఏడాదితో పోలిస్తే అదనంగా రూ.1.50 లక్షలు పెరిగిందనే చెప్పారు. 2021-22లో లైసెన్స్ కలిగిన పొగాకు బ్యారన్ కౌలు ధర రూ.లక్ష, 2022- 23లో రూ.లక్షా ఇరవై వేల నుంచి రూ.1,30,000 వరకు పలికింది. 2023-24లో రూ.1,50,000 నుంచి రూ.1,70,000 వరకు పలికింది. 2024-25 సీజన్లో రూ.2.50 లక్షల వరకు పెంచేశారు. భవిష్యత్‌లో ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

పెరిగిన భూమి కౌలు...

వేలంలో రికార్డు స్థాయిలో ధరలు పలికి లాభాలు వస్తుండడంతో పొగాకు సాగుపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. ఈ క్రమంలో భూముల కౌలు సైతం భారీగా పెంచేశారు. ఎకరానికి రూ.30,000 నుంచి రూ.40,000 వరకు పెరిగింది. అయినా రైతులు పోటీపడి మరీ కౌలుకు భూములు తీసుకుని సాగుచేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు డిసెంబర్ 10వ తేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 12వ తేదీ సామూహిక ఇళ్ల ప్రారంభోత్సవాలు చేపట్టనున్న నేపథ్యంలో అలసత్వం లేకుండా పనిచేయాలన్నారు. జిల్లాలో 3,800 నిర్మాణాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1,436 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు. మిగిలినవి కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈకి సంబంధించిన సర్వే పక్కాగా జరగాలన్నారు. జిల్లాలోని వాణిజ్య, వ్యాపార సేవా రంగాల సంస్థలు, ఉత్పత్తిదారులకు ఎంఎస్ఎంఈ సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా సర్వే చేసేలా చూడాలన్నారు. సర్వేలో ఆయా పరిశ్రమలకు సంబంధించి ఉపాధి కల్పన, టర్నోవర్, బ్యాంకు రుణాలు, రాయితీలు తదితర వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్లంబర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు నాక్ శిక్షణ సంస్థలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ ప్లంబర్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిసెంబర్ 2వ తేదీలోగా నాక్ శిక్షణ సంస్థలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. డిసెంబర్ 4వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు 96522 82636 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సామాజిక విప్లవకారుడు.. పూలే

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా పూలే వర్ధంతి
- పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలో సామాజిక ఉద్యమాలకు శ్రీకారం చుట్టిన తొలి తరం విప్లవకారుడు మహాత్మా జ్యోతీరావు పూలే ఆదర్శాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, పార్టీ నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ దేశంలో మహిళల కోసం తొలి పాఠశాలను నెలకొల్పి మహిళా విద్యను ప్రోత్సహించిన అభ్యుదయవాది పూలే అని కొనియాడారు. మహిళలు చదువుకుంటే మొత్తం కుటుంబం చదువుకున్నట్లేనని భావించి తన భార్య సావిత్రిబాయి పూలేను చదివించడమే కాకుండా ఆమెతో మహిళలకు చదువు చెప్పించారన్నారు. పూలే చూపిన బాటలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడిచారని, ఆయన హయాంలో మహిళల సాధికారిత కోసం అనేక పథకాలు చేపట్టారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలన్నింటినీ మహిళల పేరుతోనే మంజూరు చేశారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని, ఆయన జీవితాన్ని అందరూ అధ్యయనం చేయాలని కోరారు. సమాజంలో అంటరానితనాన్ని, అస్పృశ్యతను పారద్రోలి దాన్ని తిప్పికొట్టి సమసమాజాన్ని నిర్మించడం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి భావితరాలకు మార్గదర్శిగా నిలిచారన్నారు. అలాంటి నాయకుడి స్ఫూర్తిగా వైఎస్సార్ సీపీ తరఫున తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులమంతా పనిచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు గతంలో ఎన్నడూ లేనంతగా రాజకీయ ప్రాధాన్యత ఇచ్చి అధికారంలో భాగస్వామ్యం కల్పించారని గుర్తు చేశారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్న పూలే ఆలోచనలకు అనుగుణంగా విద్యారంగంలో అనేక మార్పులను జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి మాట్లాడుతూ మహిళా విద్యతోనే కుటుంబాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని, మహిళలకు సమాన గౌరవం దక్కుతుందని 140 సంవత్సరాల క్రితమే ఆలోచించిన పూలే.. దేశానికే గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. పూలే దంపతులు సమాజం కోసం వారి జీవితాలను త్యాగం చేసిన తీరు నేటికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఆ మహనీయుల ఆలోచనలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ కార్యకలాపాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తన ఇంటి నుంచి సంస్కరణలను ప్రారంభించిన మహోన్నత వ్యక్తి పూలేను స్మరించుకోవడం గర్వంగా ఉందని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ అన్నారు. సోషల్ మీడియా పోస్టుల మీద అక్రమ కేసులు పెడుతూ ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగించడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, ప్రజల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, సాంస్కృతిక విభాగం జోనల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, పార్టీ సీనియర్ నాయకులు బొట్ల రామారావు, క్రాంతికుమార్, నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్, కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కటారి ప్రసాద్, నగర మైనారిటీ సెల్ మాజీ చైర్మన్ షేక్ మీరావలి, మైనారిటీ నాయకులు షేక్ జిలాని, 14వ డివిజన్ అధ్యక్షుడు చావలి శివ, భూమిరెడ్డి రవణమ్మ, వాణి, కుట్టుబోయిన కోటి యాదవ్, తేళ్ల విక్టర్ పాల్, తాతా నరసింహాగౌడ్, పిగిలి శ్రీనివాసరావు, హౌసింగ్ బోర్డు చిన్న, సాగర్, మధు, భాస్కర్, రొండా అంజిరెడ్డి, రమేష్, ముల్లంగి రవీంద్రారెడ్డి, ప్రవీణ్, వెంకయ్య నాయుడు, పి.శ్రీను, శ్రీనివాసరెడ్డి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

బాలలతో బండ చాకిరీ..!

- దర్శిలో హాస్టల్ విద్యార్థులతో పుస్తకాల బండిళ్లు మోయించిన ఏఎస్‌డబ్ల్యూఓ
- కూలీలకు అయ్యే ఖర్చులకు కక్కుర్తిపడి పేద విద్యార్థులతో అన్‌లోడింగ్ పనులు
- 30 నుంచి 40 కేజీల బరువైన బండిళ్లు మోయలేక అల్లాడిన విద్యార్థులు



అతికష్టంమీద పుస్తకాల బండిళ్లు మోస్తున్న విద్యార్థులు

దర్శి:

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన అధికారులు, సిబ్బందే వారితో గొడ్డు చాకిరీ చేయించి విలవిల్లాడిపోయేందుకు కారణమయ్యారు. అభంశుభం తెలియని ముక్కుపచ్చలారని బాలలతో బండెడు పుస్తకాల బండిళ్లు మోయించారు. వాటిని మోయలేక విద్యార్థులు అల్లాడిపోతున్నా పట్టించుకోకుండా బలవంతంగా బండ చాకిరీ చేయించారు. దర్శిలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయానికి అవసరమైన పుస్తకాలు, స్టేషనరీ, ఇతర మెటీరియల్‌తో కూడిన బండిళ్లు వేసుకుని గురువారం రాత్రి ఓ లారీ వచ్చింది. ఆ లారీలోని బండిళ్లను ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో అన్‌లోడింగ్ చేయాల్సి ఉంది. ఒక్కో బండిల్ బరువు సుమారు 30 నుంచి 40 కేజీలు ఉంటుంది. వాస్తవానికి వాటిని కూలీలతో అన్‌లోడింగ్ చేయించాలి. కానీ, కూలి ఖర్చులు మిగిలించేందుకో.. లేకుంటే ఆ డబ్బును మింగేసేందుకో తెలీదుగానీ.. ఏఎస్‌డబ్ల్యూఓ, ఆ కార్యాలయ సిబ్బంది ఏకంగా హాస్టల్ విద్యార్థులను రంగంలోకి దించారు. అది కూడా నాలుగైదు తరగతులు చదివే 10 నుంచి 12 ఏళ్లలోపు విద్యార్థులను పిలిపించారు. ఒకరిద్దరిని లారీలోకి ఎక్కించి మరికొంత మందిని కిందే ఉంచి బరువైన పుస్తకాల బండిళ్లను కార్యాలయంలోకి మోయించారు. చిన్నారులు అష్టకష్టాలు పడుతూ వాటిని ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలోకి చేర్చారు. ముక్కుపచ్చలారని హాస్టల్ విద్యార్థులను కూలీలుగా మార్చి వారి వయసుకు మించిన బరువులు మోయించి బలవంతంగా వెట్టిచాకిరీ చేయించడంపై స్థానికులు తీవ్రంగా విమర్శించారు. ముఠా కూలీలను పెట్టి అన్‌లోడింగ్ చేయించాల్సిన వాటిని హాస్టల్లో ఉంటూ చదువుకునే పేద పిల్లలతో చేయించడంపై పలువురు మండిపడుతున్నారు. పిల్లల సంక్షేమం కోసం నియమించిన అధికారులు, సిబ్బంది.. ఆ పిల్లలనే ఇబ్బందిపెట్టడం చూస్తుంటే.. కంచే చేను మేసిన చందంగా ఉందని స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకున్నారు.

పూలే సేవలు వెలకట్టలేనివి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి డోలా, కలెక్టర్, తదితరులు

ఒంగోలు వన్‌టౌన్: సమాజానికి మహాత్మా జ్యోతీరావు పూలే చేసిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి కొనియాడారు. పూలే వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక రుగ్మతలను రూపుమాపాలంటే విద్యతోనే సాధ్యమని గ్రహించిన పూలే.. అప్పట్లోనే మహిళా విద్యను ప్రోత్సహిస్తూ సామాజిక రుగ్మతలను సమాజం నుంచి తరిమికొట్టేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. తన భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి అప్పటి సమాజంలో నెలకొన్న వివక్షత, మూఢ నమ్మకాలపై ఉద్యమాలు చేశారన్నారు. వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా మహిళల అభ్యున్నతికి, సమసమాజ స్థాపనకు పూలే చేసిన కృషిని వివరించారు. స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేసి మహిళా విద్యకు పూలే కృషి చేశారన్నారు. ఆనాడు సమాజంలో ఉన్న కుల వివక్షత, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జిల్లా అధికారి అంజల, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలో గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 13 మంది రైస్ మిల్లర్లు కస్టం మిల్లింగ్ ఆపరేషన్లలో పాల్గొనేందుకు అంగీకారం తెలిపారన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచులను రైస్ మిల్లర్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 23,504 ఎకరాల్లో పంట సాగైందని, అందుకు 59,547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వచ్చిందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు 178 రైతు సంక్షేమ కేంద్రాల పరిధిలో 33 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాధారణ రకం ధాన్యం క్వింటా ధర రూ.2,300, గ్రేడ్‌ఏ రకం క్వింటా ధర రూ.2,320గా నిర్ణయించినట్లు వివరించారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ సిద్ధం చేయాలన్నారు. హమాలీలను కూడా అందుబాటులో ఉంచాలని, డిసెంబర్ రెండో వారంలో వరికోతలు ప్రారంభమవుతాయని తెలిపారు. కొనుగోలుకు సంబంధించి రూ.11 కోట్ల బ్యాంక్ గ్యారంటీలు అందజేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. 6ఏ కేసులు, డీఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు కొనుగోలు ప్రక్రియలో పాల్గొనరాదని జేసీ స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల మేనేజర్ వరలక్ష్మి, డీఎస్ఓ పద్మశ్రీ, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా గ్రావెల్ తరలింపు

● జేసీబీ, 12 టిప్పర్లు సీజ్ చేసిన పోలీసులు

మద్దిపాడు: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 12 టిప్పర్లు, జేసీబీని బుధవారం అర్ధరాత్రి పోలీసులు సీజ్ చేశారు. ఈ సంఘటన మద్దిపాడు మండలంలోని బూరేపల్లి కొండ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుండ్లకమ్మ పరివాహక ప్రాంతానికి ఆనుకొని ఉన్న పాత బూరేపల్లి కొండ వద్ద అర్ధరాత్రి అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, సంతనూతలపాడు ఎస్సై అజయ్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అందులో మూడు టిప్పర్లు గ్రావెల్‌తో లోడ్ చేసి ఉన్నాయి. మిగిలిన 9 టిప్పర్లు గ్రావెల్ నింపుకొనేందుకు వేచి ఉన్నట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లగానే టిప్పర్ల డ్రైవర్లు మొత్తం పారిపోయారు. జేసీబీతోపాటు 12 టిప్పర్లను మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

వల్లూరమ్మ హుండీ ఆదాయం రూ.23.49 లక్షలు



వల్లూరమ్మ ఆలయంలో హుండీలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన వల్లూరమ్మ ఆలయంలో గురువారం హుండీలు లెక్కించారు. మొత్తం 129 రోజులకు గాను 10 హుండీలు లెక్కించగా రూ.23,49,769 నగదు, 72 గ్రాముల బంగారం, 809 గ్రాముల వెండి వస్తువులు వచ్చినట్లు ఆలయ ఈఓ బి.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, ఈఓ కోయ మోహన్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్, సేవా సంఘ సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జాయ్'లో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

ఒంగోలు టౌన్: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల జాయ్ హాస్పిటల్లో శుక్రవారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీఆర్‌ఓ జి.ప్రకాష్ తెలిపారు. ఈ శిబిరంలో సంతానం లేని దంపతులకు వైద్య సేవలతోపాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్, సెమన్ అనాలసిస్ పరీక్షలు ఉచితంగా చేస్తామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ నోయల్ జాన్, సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ జాన్సీ మాథ్యూ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సంతానంలేని దంపతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 90006 12330, 93903 13574ను సంప్రదించాలని సూచించారు.

● 'ఓవర్' ఫ్రమ్ వైపాలెం

సకుటుంబ సమేత అరాచకం!

యర్రగొండపాలెంలో పెత్తనం కోసం పచ్చనేత కుటుంబం ఆరాటం

- మీడియా ముసుగులో అరాచకాలకు తెగబడిన ఓ చానల్ కెమెరామెన్
- రేషన్ డీలర్లపై అక్రమ కేసులు బనాయించడంలోనూ హస్తం
- బియ్యం తరలింపులో నెలవారీ వాటా ఇవ్వాల్సిందేనని అల్టిమేటం
- పంచాయతీలో శానిటేషన్ మేస్త్రీని కులం పేరుతో దూషించిన అదే కుటుంబ వ్యక్తి
- వైపాలెంలో మద్యం మత్తులో ర్యాగింగ్ ఘటనలోనూ అదే కుటుంబ పిల్లలు
- వీరి ఆగడాలు భరించలేక తలలుపట్టుకుంటున్న అధికారులు



టీడీపీ కార్యాలయం వద్ద ఘర్షణ పడుతున్న విద్యార్థులు (ఫైల్)

యర్రగొండపాలెం: ప్రశాంతంగా ఉండే యర్రగొండపాలెంలో ఓ పచ్చ నేత కుటుంబం సాగిస్తున్న అరాచకం హద్దు మీరుతోంది. పట్టణంపై పెత్తనం చేసేందుకు ఉబలాటపడుతున్న ఆ పచ్చనేత కుటుంబ ఆగడాలకు అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీరు రేషన్ షాపులు, పంచాయతీ కార్యాలయంపై పెత్తనం చెలాయించడం మొదలుపెట్టారు. పాఠశాలల్లో వంట వండేవారిని సైతం వదల్లేదు. మీడియా(సాక్షి కాదు)లో కెమెరామెన్‌గా పనిచేస్తున్న పచ్చ నేత కుటుంబంలోని ఒకరు తరచూ బెదిరింపులకు దిగుతున్న తీరు స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆ కుటుంబం చేస్తున్న అరాచకాలతో నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుడికి సైతం విసుగుపుట్టి వార్నింగ్ ఇచ్చి, కెమెరామెన్‌ను దూరం పెట్టినట్లు సమాచారం. ఇదే కుటుంబంలో ఒకరు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో రేషన్ షాపు సజావుగా నిర్వహించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ షాపులు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. కొంత మంది డీలర్లతో రాజీనామాలు చేయించడం, అక్రమంగా 6ఏ కేసులు నమోదు చేయించి ఆ షాపును ఇతరులకు అప్పజెప్పడంలో వీరి పాత్ర ప్రముఖంగా ఉందని బాధిత డీలర్లు వాపోతున్నారు. అంతటితో ఆగకుండా రేషన్ అక్రమ దందాలో తనకు కూడా వాటా ఇవ్వాలని మీడియాలో పనిచేస్తున్న ఆ కుటుంబంలోని ఒకరు డిమాండ్ చేయడంతో డీలర్లు నిరాకరించారు. ఇప్పుడు నెలవారీ వాటా కోసం డీలర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది.

పంచాయతీలో తాత్కాలిక స్వీపర్‌గా చేరిన పచ్చ నేత కుటుంబానికి చెందిన ఒకరు కార్యాలయంలో ఆధిపత్యం చెలాయించేందుకు సిద్ధమయ్యాడు. అందులో భాగంగా తనకు పని పురమాయించిన స్వీపర్ మేస్త్రీని కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనపై మేస్త్రీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పంచాయతీ అధికారులు, మరికొంతమంది కలిసి స్వీపర్ మేస్త్రీని బెదిరించి ఆ ఫిర్యాదును వెనక్కు తీసుకునేలా పావులు కదిపారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో వంట మనుషులను కొత్తగా చేర్పించేందుకు డబ్బు వసూలు చేసినట్లు తెలుసుకున్న పాత వంట మనుషులు ఆ ప్రాంతానికి చెందిన ఒక నాయకుడి ఎదుట గోడు వెళ్లబోసుకోవడంతో ఈ పంచాయితీ కాస్తా నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుడి వద్దకు చేరింది. పాత వంట మనుషులు టీడీపీ సానుభూతిపరులైనప్పటికీ వైఎస్సార్ సీపీ హయాంలోనూ వారిని తొలగించలేదని, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని తొలగించేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ఆ నాయకుడు గట్టిగా ప్రశ్నించడంతో తప్పనిసరై వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా తాజాగా.. బుధవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం రోడ్డులో విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఆ కుటుంబంలోని ఇద్దరు విద్యార్థుల పాత్ర ఉంది. ఘర్షణ జరుగుతున్న విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రభాకరరావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇద్దరు విద్యార్థులు మద్యం సేవించి ఉన్నట్లు అనుమానించి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో న్యూస్ చానల్ కెమెరామెన్ అడ్డుతగిలాడు. వారు తన కుమారులని చెప్పడంతో పోలీసులు చేసేది లేక ఓ అడుగు వెనక్కు వేశారు. పచ్చ నేత కుటుంబం తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నప్పటికీ కూటమి ముఖ్య నాయకులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం యర్రగొండపాలెంలో చర్చనీయాంశమైంది.

ప్రకాశం ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ప్రకాశం జిల్లా ఆర్చరీ క్రీడాకారులను గురువారం స్థానిక ఏబీఎం కాలేజీ ఆవరణలో ఎంపిక చేసినట్లు సంఘ కార్యదర్శి పి.లెమ్యూల్ రాజు తెలిపారు. ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. వీరు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

ఎంపికైంది వీరే..

ఇండియన్ రౌండ్ బాలురు : షేక్ సయ్యద్ బాషా, ఎన్.కిరణ్‌బాబు, వి.కమలేష్, కె.గోవర్ధన్, కె.నాగరాజు, ఎ.వెంకట గణేష్

రికర్వ్ బాలురు : జీవీఎస్ మణిదీప్‌రెడ్డి, బి.రాంబాబు

కాంపౌండ్ బాలురు : డి.జ్యోతి ప్రకాష్‌రెడ్డి, బి.వంశీకృష్ణ

రికర్వ్ బాలికలు : ఎ.తీర్థప్రియ.

సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు

కనిగిరిరూరల్: సోషల్ మీడియాలో హోం మంత్రి, మంత్రులపై అసభ్యకర పోస్టులు పెట్టినట్లు కనిగిరికి చెందిన ఐటీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఎం హరీశ్వరరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు. హరీశ్వర్‌రెడ్డి శ్రీకాకుళం జైల్ ఉండగా పీటీ వారెంట్‌పై అతన్ని తీసుకొచ్చి కనిగిరి కోర్టులో హాజరుపర్చగా.. 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

జ్యోతిరావ్ పూలే జీవితం స్ఫూర్తిదాయకం

● ఎస్పీ దామోదర్



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్, డీపీఓ సిబ్బంది

ఒంగోలు టౌన్: మహిళల అభ్యున్నతి కోసం అవిరళ కృషి చేసిన గొప్ప సంస్కర్త, బడుగు బలహీన వర్గాల సాధికారిత కోసం పోరాడిన యోధుడు జ్యోతిరావ్ చరిత్రలో మహాత్ముడిగా నిలిచిపోయరని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మహాత్మా పూలే 134వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో మహిళలకు విద్యావకాశాన్ని కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసిన నిజమైన సంస్కర్త పూలే అని కొనియాడారు. సమాజంలో అంటరానితనాన్ని కూకటివేళ్లతో పెకిలించి వేయాలని పోరాడారని, సామాజిక అసమానతలను, దురాచారాలను పారదోలడం విద్యతోనే సాధ్యమని తలచి అందుకోసం పాఠశాలలు స్థాపించారని తెలిపారు. ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగలించిన విప్లవకారుడన్నారు. భావితరాలకు నిత్య స్ఫూర్తిప్రదాతగా, కాంతిరేఖగా నిలిచారన్నారు. మహిళలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి విద్యాభివృద్ధి ద్వారా సాధికారత కల్పించాలని తలపోసిన పూలేను స్మరించుకోవడం నేటి తరానికి అవసరం అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడం, బడుగుల అభ్యున్నతి కోసం పాటుపడడం ద్వారా పూలే సమసమాజ నిర్మాణం చేసేందుకు జీవితాంతం పోరాడరని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవ ప్రభాకర్, డీపీఓ ఓఏ రామ్మోహనరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమేష్ కృష్ణన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ పూర్తి చేయాలి



టీచర్‌ను సత్కరిస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

చీమకుర్తి: పాఠశాలల్లో అపార్ ఐడీ కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేయాలని డీఈఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం చీమకుర్తి ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి డీఈఓతో పాటు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అపార్ ఐడీ పూర్తి చేయటంలో ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. అపార్ ఐడీ పూర్తి చేయటానికి అవసరమైన ఆధార్ సెంటర్‌లను చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు, పల్లామల్లి జిల్లాపరిషత్ హైస్కూళ్లలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిసెంబర్ 7న పాఠశాలల్లో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు తల్లిదండ్రులను చైతన్యం చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన పరీక్షలకు సంబంధించిన మార్కులను ఆన్‌లైన్లో నమోదు చేయాలని, ఫేషియల్ అటెండెన్స్‌ను ఉదయం 9 గంటల్లోపు నమోదు చేయాలన్నారు. అనంతరం అపార్ ఐడీ పూర్తి చేయటంలో శ్రద్ధ వహించిన రామతీర్థం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ క్రాంతి సుధాను సత్కరించారు. ఎంఈఓలు కె.శివాజీ, నరసింహారావు, డీసీఈబీ సెక్రటరీ నరసింహారావు, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలను తిరుపతి తరలించండి

● అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి



అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి



మొక్కలు నాటుతున్న అధికారులు

కనిగిరిరూరల్: కనిగిరి అటవీ శాఖ గోడౌన్‌లో ఉన్న ఎర్రచందనం దుంగలను, ముక్కలు, డస్ట్, చిప్స్ పౌడర్‌ను తిరుపతి సెంట్రల్ గోడౌన్‌కు తరలించాలని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి అధికారులను ఆదేశించారు. కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాలను గురువారం ఆయన పర్యటించారు. కనిగిరి ఏరియాలోని నగరవనం, నడికుడి కాళహస్తి రైలుమార్గం వెళ్లే అటవీ ప్రాంతాన్ని, శంఖవరంలో చేపట్టిన ప్లాంటేషన్‌ను, ఫారెస్ట్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం కనిగిరి సమీపంలో శ్రీరంగపురం సమీపంలోని నగరవనం(హాజీపురం) ఆర్ఎఫ్‌లోని ప్లాంటేషన్‌ను పరిశీలించారు. మొక్కల పెంపకం తీరును, ఏఏ రకాల మొక్కల పెంపకం జరుగుతుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కనిగిరి రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతం గుండా వెళ్తున్న నడికుడి కాళహస్తి రైలుమార్గం ఏరియాను పరిశీలించి, ఎంత వరకు ఫారెస్ట్ ఏరియాను రైల్వే శాఖకు అప్పగిస్తున్నారనే దాని మ్యాప్‌ను, క్షేత్రస్థాయిలో పర్యటించి చూశారు. అనంతరం శంకవరం పరిధిలో 100 హెక్టార్లలో చేపట్టిన ఎస్‌టీఎస్ హెచ్ ప్లాంటేషన్ పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు ఫారెస్ట్ కన్జర్వేటర్ విశ్వనాథరాజు, జిల్లా డీఎఫ్ఓ హిమశైలజ, డీఎఫ్ఓ ఎస్ఎఫ్ రాజశేఖర్, సబ్ డీఎఫ్ఓ శ్రీనివాస్, కనిగిరి రేంజర్ తుమ్మా ఉమామహేశ్వరరెడ్డి, ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత కార్యాలయ ఆవరణలో సీసీఎఫ్ అధికారి చిరంజీవ్ చౌదరి మామిడి మొక్కలు నాటారు.

1న కొత్తపట్నంలో యాదవ కార్తీక వనభోజనాలు



మాట్లాడుతున్న వెంకట్రావు యాదవ్, పక్కన పీఎల్‌పీ తదితరులు


మార్కాపురం: కొత్తపట్నం సమీపంలోని నల్లూరి గార్డెన్స్‌లో డిసెంబర్ ఒకటో తేదీన జిల్లా స్థాయి యాదవ కార్తీక వన భోజనాలు నిర్వహించనున్నట్లు యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచగర్ల వెంకట్రావుయాదవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 8 పర్యాయాలు జిల్లా స్థాయి కార్తీక వనభోజనాలు నిర్వహించామని, ఈ దఫా సుమారు 10 వేల మంది హాజరవుతున్నారని తెలిపారు. క్రమశిక్షణా సంఘం జాతీయ అధ్యక్షుడు పీఎల్‌పీ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలో యాదవులందరూ సంఘటితంగా ఉండి సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాల, కందుకూరు డివిజన్ల పరిధిలో యాదవులు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు జి.వెంకటేశ్వరరావు, రిటైర్డు డీఈ చల్లా లక్ష్మీ నారాయణ, నాగేశ్వరరావు యాదవ్, జీవీ సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద రీతిలో వృద్ధుడు మృతి

- తండ్రీ కొడుకుల మధ్య డబ్బు కోసం గొడవ
- కొడుకే చంపి ఉంటాడని స్థానికుల అనుమానం



మృతి చెందిన వెంకటేశ్వర్లు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

అద్దంకి రూరల్: అనుమానాస్పద రీతిలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం అద్దంకిలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణయ్య కథనం మేరకు.. అద్దంకిలోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లో నివాసం ఉంటున్న ముప్పరాజు వెంకటేశ్వర్లు (64) గతంలో లారీలో క్లీనర్‌గా పనిచేసేవాడు. ఆరోగ్యం సరిగా లేకపోవటంతో కొంత కాలం నుంచి ఇంటివద్దనే ఉంటున్నారు. వెంకటేశ్వర్లు భార్య 15 ఏళ్ల క్రితం మరణించింది. వీరికి ఒక కుమారుడు సుబ్బారావు ఏ పని చేయకుండా చెడువ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో మృతుడు వెంకటేశ్వర్లు స్వగ్రామం మండలంలోని కశ్యాపురంలో ఉన్న పొలాన్ని 6 నెలల క్రితం అమ్మితే సుమారు రూ. సుమారు 12 లక్షల వరకు వచ్చాయి. ఆ డబ్బులు తోనే ఇరువురూ మద్యం తాగుతూ ఉండేవారు. ఈ నగదు విషయంలో తనకు ఇవ్వాల్సింది అని సుబ్బారావు తరచూ తండ్రితో గొడవ పడుతుండేవాడు. గతంలో ఒకటి రెండు సార్లు సుబ్బారావు తండ్రిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. తెల్లవారే సరికి వెంకటేశ్వర్లు మంచం మీదే తలకు బలమైన గాయంతో విగతజీవిగా పడి ఉన్నాడు. పరిసర గృహాలవారు పోలీసులకు సమాచారం అందించటంలో సీఐ సిబ్బందితో అక్కడకు చేరుకుని వృద్ధుడి మృతికి గల కారణాలు, పరిసరాలను పరిశీలించారు. కుమారుడు సుబ్బారావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చీరాల డీఎస్పీ మోయిన్, సీఐతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఘనంగా గంధ మహోత్సవం



గంధమహోత్సవంలో దర్గా వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు, నాయకులు

పామూరు: పట్టణంలోని సీఎస్‌పురంరోడ్డులో ఉన్న హజరత్ మహబూబ్ సుబాని దర్గా 48వ గంధ మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాలో పలువురు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుని ముజావర్ల దీవెనలు పొందగా, గంధ మహోత్సవంలో హిందూ, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాను ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రార్థనా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సెంట్రింగ్‌చాంద్‌బాషా, ఎంపీటీసీ షేక్. అబ్దుల్, కాలేషా, మీరామొహిద్దీన్, పలువురు నాయకులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంధ మహోత్సవం సందర్భంగా సీఐ ఎం భీమానాయక్ ఆధ్వర్యంలో పామూరు ఎస్సై టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం ఎస్సై ఆర్.సుమన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

ఉద్యోగాలకు వాత.. వేతనానికి కోత!

- ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందికి 'కూటమి' మొండి చేయి
- జిల్లాలో 600కు పైగా చిరుద్యోగులకు అందని చివరి నెల వేతనం

కంభం: నూతన మద్యం పాలసీ పేరుతో చిరుద్యోగుల జీవనోపాధిపై వేటు వేసిన కూటమి ప్రభుత్వం.. వారు చేసిన చాకిరీకి వేతనం కూడా ఇవ్వడకుండా కక్ష సాధిస్తోంది. గత ప్రభుత్వంలో సర్కారీ మద్యం దుకాణాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మందిని నియమించారు. జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 600 మందికి పైగా విధులు నిర్వర్తించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో సర్కారీ మద్యం దుకాణాలు మూతపడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది అక్టోబర్ 16 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభం కావడంతో చిరుద్యోగులు మొత్తం ఆగిపోవాల్సి వచ్చింది. అయితే మద్యం దుకాణాల ఉద్యోగులతో అక్టోబర్ 21వ తేదీ వరకు పని చేయించుకున్న కూటమి ప్రభుత్వం స్టాక్‌ను ఐఎంఎఫ్ఎల్ డిపోలకు చేర్పించింది. ఇందుకుగాను అక్టోబర్ నెలకు పూర్తి వేతనం ఇస్తామని చెప్పింది. కానీ తమకు వేతనం ఇవ్వలేదని చిరుద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. వేతన బకాయిలు ఎప్పుడిస్తారని ఏజెన్సీ ప్రతినిధులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి నగదు జమ కాలేదని సమాధానం దాటవేస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి చివరి నెల వేతనం ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అడిగితే చెక్కు రాలేదంటున్నారు



అక్టోబర్ నెల జీతం ఇంతవరకు ఇవ్వలేదు. ఏజెన్సీ వారికి ఎప్పుడు ఫోన్ చేసి అడిగినా జీతాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి చెక్కు రాలేదని సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే తమకు రావాల్సిన జీతం బకాయి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– నందిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కంభం

రోడ్డున పడ్డాం



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. కొత్త ప్రభుత్వం వచ్చాక మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేయడంతో రోడ్డున పడాల్సి వచ్చింది. నాలాంటి ఎంతో మంది పొలంలో కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మాకు రావాల్సిన చివరి నెల జీతం వెంటనే ఇస్తే ఆర్థిక భారం కాస్తయినా తప్పుతుంది.

– మార్నెళ్ల నాగార్జున, సేల్స్‌మన్

ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ అధ్యక్షుడిగా సత్య సాయి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. గురువారం రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికలో నాయకులు పిన్నిక మధుసూధనరావు, ఆర్. వాసుదేవరావు, ఆర్‌పీఎస్ కృష్ణమోహన్, దానియేల్, ఊతకోలు శ్రీనివాసరావు మద్దతుతో కలెక్టరేట్ యూనిట్ ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఎన్నికల అధికారులుగా డిప్యూటీ తహసీల్దార్లు కె. వెంకటేశ్వరరావు, రామనారాయణ రెడ్డి వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎస్‌కే షాజహాన్, కె. శ్రీదేవి, లక్ష్మీబాయి, సెక్రటరీలుగా బి. రాజశేఖర్‌రెడ్డి, వెంకటసాయికుమార్, ఖాదర్‌బాష, మహేశ్వర వెంకట్‌బాబు, ట్రెజరర్‌గా పిచ్చిరాజు, ఈసీ సభ్యులుగా రాధాకృష్ణమూర్తి, ప్రియాంక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.